# దోపిడీ కథ

కంచర్ల రమణ



ఆ వాళ నైట్ షిఫ్టు మీదున్నాను.

ఇంట్లో నా భార్యకు ఒంట్లో బాగుండక పోవడం వల్ల, రెండు గంటల పర్మిషన్ తీసుకుని ఇంటికి వస్తున్నాను.

రాత్రి సుమారు పదకొండున్నర అయింది.

త్వరగా ఇల్లు చేరుకోవాలన్న ఉద్దేశంతో, అడ్డ తోవ పట్టాను.

రోడ్డు నిర్మానుష్యంగా ఉంది. ఒంటరిగా పోవడం అంటే నాకేమాత్రం భయం లేదు. పైగా అలవాటుకూడా. నాకు దెయ్యాలు, భూతాలు అంటే నమ్మకం ఏమాత్రం లేదు.

అయినా ఒక భూతం నన్ను ఎటకాయించింది. అది నరాకారంలో ఉంది. చేతిలో కత్తి ఉంది. కళ్ళలో తెగింపు ఉంది. "నీ దగ్గరున్న దంతా ఇలా పడెయ్" అని అందికూడా.

ఆ రోజు ఫాక్టరీ నుంచి ఇంటికి బయలుదేరే ముందు, జబ్బుతో ఉన్న నా భార్యకు మందులు కొనడం కోసం, నా స్నేహితుడి దగ్గర అప్పు చేసి తెస్తున్న పాతిక రూపాయలు పాంటు జేబులో ఉన్నాయి. అంతకు మించి చేతి కున్న రిస్టువాచీ, అర తులం పెళ్ళి ఉంగరం ఫాక్టరీలో లాకర్లో పెట్టి తెచ్చుకోవడం మరిచిపోయాగానేమో, నా వద్ద ఇంకేవీ లేవు.

ఆ పాతిక రూపాయలు ఆ భూతం చేతిలో పెట్టి, మర్యాదగా అక్కడినుంచి వెళ్ళిపోవడం తప్ప నాకు ఇంకో మార్గం తోచలేదు.

ఆ డబ్బు వాడి చేతిలో పెట్టి "నా దగ్గర ఇంకేవీ లేవు. కావాలిస్తే చూసుకో" అంటూ నేను చేతు లెత్తి నిలబడేసరికి, ఆ భూతం చీకట్లోకి ఒక గెంతు గెంతి అదృశ్యం అయింది, నే నిచ్చిన డబ్బుతో.

నా భార్య మందులకోసం తెచ్చిన డబ్బుకు ఆ గతి పట్టడంతో నా హృదయం బాధతో మెలి తిరిగి పోయింది.

నేను పడ్డ ఆ బాధ ఉండబట్ట లేక నా మిత్రుడు విప్లవరావుతో చెప్పుకున్నాను. నాకు కలిగిన నష్టానికి, కష్టానికి వాడు విచారం వెలిబుచ్చకపోగా, ఒక క్షణం మౌనం వహించి "అవునురా. ఆకలి బాధ మనిషిని దొంగను చేస్తుంది. దోపిడీగాణ్ని చేస్తుంది. ఒక్కో సారి హంతకుణ్ని చేస్తుంది కూడా. కడుపులో పేగులు మాడి పోతుంటే, 'ఇది తప్పా? ఒప్పా?' అన్న విచక్షణ జ్ఞానం ఎక్కడే డుస్తుంది మనిషికి? వాణ్ని సానుభూతితో అర్థం చేసుకుని, క్షమించి వదిలేయాలి కాని, మనలా తలచ కూడదు. మనిషిని మంచి మాధవుణ్ని తయారు చెయ్యడం మాటటుంచి అసహాయకుల్నించి దొంగల్ని, హంతకుల్ని తయారు చేస్తున్న మన ఆర్థికవ్యవస్థకు జోహార్లు" అన్నాడు.

ఈ సందర్భంలో విప్లవరావును గురించి నేను చెప్పాల్సిన ముక్కలు రెండున్నాయి.

విప్లవరావు విప్లవవాది. అతడి పేరు అప్పారావు అని ఉండేది మొదట. దోపిడీ చెయ్యబడ్డ మనిషి. దోపిడీ చేసిన వాణ్ని తిరిగి దోపిడీ చెయ్యడంలో సాంఘిక న్యాయమే తప్ప నేరం లేదన్న తీవ్ర సోష లిస్టు సిద్ధాంతి. ఆ సిద్ధాంతాన్ని సమ్మదంతో పరిపుచ్చుకోక విరివిగా ప్రచారం సాగిస్తున్న అతన్ని. అతడి స్నేహితులుకూడా అతడి అసలు పేరు వదిలేసి విప్లవరావు అంటూ పిలవ నారంభించారు. అతడు కూడా అందుకు అభ్యంతర పెట్టలేదు. అందుచేత ఆ పేరుతోనే ఇంటా బయటా చలామణి కాసాగాడు అప్పటినుంచీ.

విప్లవరావు రచయితకూడా. తన సిద్ధాంతాల్ని దండిగా చొప్పిస్తాడు తన కథల్లో ఎప్పుడూ. అసలు అలాంటి కథలు తప్ప మరొకటి రాయనని ఒట్టు పెట్టుకున్నాడుకూడా. చక్కని కథ రాసి పేరు తెచ్చుకోవడం కన్నా, ఒక ఇజాన్ని పట్టుకుని తద్వారా పేరు, పలుకుబడి కొట్టేయడం సులు వన్న కిటుకు విప్లవరావుకు తెలుసు. అందుకే అతడు అలాంటి కథలు రాస్తుంటాడని కిట్టని వాళ్ళు కొందరు నా తోవగా అన్నారు కాని, నే నేం పట్టించుకో లేదు.

కాని ఒకటి మాత్రం నిజం. విప్లవరావుకి విప్లవ వాది అయ్యాక రచయిత అయ్యాడో, రచయిత అయ్యాక విప్లవవాది అయ్యాడో చెప్పడం కష్టం కాని, అతని కథల్లోని విప్లవవాదం అతణ్ని ఒక మేటి రచయితగా చేసి పారేసింది.

"ఏమిట్రా? ఆకలి బాధ అంటావు వాడు దూడ ముక్కలా, లావుగా, పొడుగ్గా, కన్నా ఆరోగ్యంగా బలంగా ఉంటేనూ" అన్నాను.

ప్రతీ విషయాన్ని సోషలిస్టు సిద్ధాంతాల కోణం నుంచి తప్ప ఇంకోలా చూడ్డం మానుకున్న విప్లవరావు మనస్తత్వం నా కెరుకే కాని, నా బాధ చెప్పుకోవాలన్న ఆతృతలో ఆ విషయం మరిచి పోయాను. లేకపోతే ఆ ఊసు వాడితో ఎత్తేవాణ్ని కాను.

ఈ మధ్య 'జైలు పక్షులు' అన్న కథ ఒక పత్రికకు కకు పోటీకి పంపగా, రెండో బహుమతి కొట్టేసింది అది. అసహాయకులూ, అభాగ్యులు ఎలా అధికారులు, పెట్టుబడిదారుల కుట్రకు గురై జైళ్ళ మగ్గు తున్నారో, ఆ కథలో విపులంగా వర్ణించబడింది. మన దేశం లోని న్యాయవ్యవస్థ మీద చక్కని

'సెక్సెర్' అది. అయితే, ఆ కథ చదివాక, ఒక విచిత్రమైన భావన పాఠకుడిలో మిగిలి పోతుంది. పత్రికకు పంపిన ఉత్తరం రూపంలో ఒక పాఠకుడు ఆ భావని వ్యక్తం చేశాడుకూడా. "జైల్లో ఉన్న వాళ్ళందరూ అన్యాయకులూ, అభాగ్యులూ అయితే జైలు బయటున్న మనందరం దొంగలంటారా విప్లవరావుగారూ" అంటూ ఒక బెణుకు వదిలాడు ఆ పాఠకుడు.

"ఆకలి బాధ కాకపోతే, ఇంకేమి టంటావు? వాడు లావుగా బలంగా ఉన్నాడన్న విషయం ఇక్కడ అప్రస్తుతం" అన్నాడు విప్లవరావు నాతో వాదనకు తలపడుతూ.

"ఆ విషయం అప్రస్తుతం ఎలా అవుతుందిరా? వాడు బలంగా, లావుగా లేకపోయుంటే, వాడు కత్తి కాదు కదా, తుపాకీ చూపినా బెదిరి ఉండేవాణ్ని కాదు. ఆఫ్టరాల్. కాయ కష్టం చేసే కార్మికుణ్ణి. ఆ మాత్రం వాణ్ని తన్ని తగిలేయ నంటావా?"

"నువ్వెన్ని చెప్పు. తనని దోచేసి, తన కర్కశ పాదాల కింద తనని తొక్కి పారేసుకున్న ఈ దగా కోరు సమాజం మీద వాడు చేసిన తిరుగుబాటు అది. అతణ్ని తప్పు పట్టలేం."

"దోపిడీ చేసిన వాణ్ని దోచేయాలిసిందే. కాదనను. కాని, నే నేం చేశాను వాణ్ని? భార్య జబ్బు కోసం అప్పు చేసి డబ్బులు కొట్టేయడం అదేం న్యాయం?

"ఆ వివరాలు వాడికెలా తెలుస్తాయి? తనని దోచేస్తున్న సంఘం మీద బదులు తీర్చుకోవడం తప్ప, వారికి మరోటి తెలీదు."

"నువ్వు చెప్పింది సరీ బావుంది. మేకల్ని మేసే పులుల్ని వదిలేసి కుందేళ్ళ మీద అవీ అడివి జంతువులే అన్న కారణంగా మేకలు కలియబడితే, ఏం లాభం?"

"అదంతా నీకు విపులంగా చెప్పే తీరిక నాకు లేదు గాని, సూక్ష్మంగా ఈ సాంఘిక పరిస్థితుల వెనుక ఉన్న ఆర్థిక అర్థాలు నీకు తెలియబరిచాను. వసుంది వస్తాను" అంటూ విప్లవరావు హడావుడిగా వెళ్ళిపోయాడు.

కొద్ది క్షణాల క్రితం వరకు నాకు డబ్బు పోయిందే అన్న ఏడుపు మాత్రం ఉండేది. దానికి ఇప్పుడు మరో ఏడుపు తోడైంది.

విప్లవరావు ఇచ్చిన వ్యాఖ్యానం ప్రకారం, నేను దోపిడీ వ్యవస్థకు ప్రతీకని. దాని మీద తిరుగు దోపిడీ చేసి ఆ వ్యక్తి ఎవరోగాని, తనకసి తీర్చు కున్నాడు. దానికి విప్లవరావు సెభాష్ అంటూ చప్పట్లు చరిచి అభినందించాడు.

సుమారుగా నాలుగు నెలలు గడిచిపోయాయి. విప్లవరావు, నేను కలవడం పడలేదు. ఒక రోజు హడావుడిగా పార్కులో తారస పడ్డాడు. వాడి కళ్ళల్లో మెరుపుని బట్టి, వాడు చాలా హుషారుగా ఉన్నాడని గ్రహించాను. వాణ్ని పలకరించాను.

"విప్లవ పత్రికలో ఈ మధ్య నా కథ పడింది; చదివావుటా?" అన్నాడు ఉత్సాహంతో

"ఆఁ! చదివాను" అన్నాను ఆ కథ పేరు గుర్తుకు తెచ్చుకుని.

ఒక లక్షాధికారి తన కార్లో ఒక వూరు బయలు దేరాడు. తోవలో కారు ఫెయిలయింది. అదంతా నిర్జనప్రదేశం. కారుని ఉన్న చోట వదిలేసి సమీపంలో ఉన్న వూరికి కాలి నడకన బయలుదేరాడు తన కారుని రిపేర్ చెయ్యడానికి, మెకానిక్ ఎవడన్నా దొరకుతాడన్న ఆశతో. అదే సమయంలో అటు వైపుగా ఒక దోపిడీ దొంగ వచ్చాడు. దగ్గరున్న విలువైన ప్రతి వస్తువూ కొల్లగొట్టుకు పోతూ "నిజానికి నువ్వూ, నేనూ ఒకటే. ఆ సామ్యం మనం అవలంబించిన పద్ధతుల మేరకే. ఆ మీదట నేను కలికాతారాన్ని. నువ్వు పేదోళ్ళ కడుపులు కొట్టి పెద్దోడివయితే. నేను పేదోళ్ళ కడుపుల కోసం పెద్దోళ్ళని కొడతాను ఈ సమాజపు ఆర్థిక అసమానతల్ని రూపుమాపే నాలాంటి వాడు చాలా అవసరం గుడబై" అంటాడు దోపిడీదొంగ.

"ఆ కథకి పాఠకుల్నించి ఎంత రెస్పాన్స్ వచ్చిందో తెలుసునా?" అడిగాడు విప్లవరావు పొంగి పోతా లేదన్నట్టుగా ఉత్సాహంగా.

"ఆ కథ పడి రెండు నెలలు కావస్తున్నా, ఇంకా పాఠకుల్నించి ఉత్తరాలు వస్తూనే ఉన్నాయి. పత్రిక వాళ్ళు వేసుకున్నవి వేసుకోగా, తతిమ్మాని నాకు ప్రత్యేకంగా పంపారు. ఆ కథకు పేరు ఎలాగో తెలుసునా?"

"తెలియకేం...నేనే... నేను చెప్పిన సంఘటన ఆధారంగానే ఆ కథ రాశావు."

ఆనందంగా తలూపాడు అవునన్నట్టుగా.

"అక్కడ నా నా పాత్రని లక్షాధికారిని చేసేశా వేం? కథని యథాతథంగా రాసేయాల్సింది" అన్నాను.

విప్లవరావు ధోరణి మీద నాకో కంప్లయింట్ ఉంది. వాడి కథల్లో విలన్ ఎప్పుడూ డబ్బున్నవాడే వాడెప్పుడూ పరమ దుర్మార్గుడే. భవుకతింగా వాడికి నోట్లో కోరలు, తల మీద కొమ్ములు ఉండవు గాని, వాడు అక్షరాలా రాక్షసుడు. వాడు ఎప్పుడూ పాములా నవ్వడమో పులిలా గాండ్రించడమో తప్ప మామూలుగా ప్రవర్తించడు.

అలాంటి వాణ్ని ఒక పేదవాడో, మరో వ్యక్తో— అతడే హీరో—కొట్టి చంపడమో తన్ని, అవమాన పరచడమో చేసినట్లు చిత్రిస్తే, కాదనే దెవరు? అదీ విప్లవరావు తన కథలో చూపే గడుసుతనం.

ఖచ్చితమైన సాక్ష్యాధారాలు ఉన్నా, పనిచేయని కార్మికుల్ని ఉద్యోగం లోంచి తీసి పారేయడానికి గజ గజా వణుకుతారు ఫాక్టరీ యజమానులు, ఆ వ్యక్తి యూనియన్ బలంతో ఏ కష్టాలు తమ మీదకు తెచ్చి పెడతాడో అని. అదే విప్లవరావు కథలో ఫాక్టరీ యజమానులు, నిజాయితీగా పని చేస్తూ అణకువగా ఉండే కార్మికుల్ని కూడా పనిలోంచి తీసేసి మరీ నిశ్చింతగా నిద్రపోతుంటారు.

అదే మాదిరిగా యథార్థ సంఘటన మీద ఆధార పడ్డ ఈ కథలో కూడ తనకనుకూలంగా నన్ని ఒక లక్షాధికారిని చేసేయగానే, అందుకే అలా అడిగాను.

"నీకు తెలీదు. అలా రాస్తే ఆబ్సర్డ్‌గా ఉంటుంది. నువ్వు కార్మికుడివి. నిన్ను మరొకడు దోచినట్టు రాస్తే వాడు విలన్ అవుతాడు గాని హీరో కాదు" అన్నాడు జవాబుగా.

నా ఆశ్చర్యానికి అంతులేదు. ఆ వాళ నా మీద దోపిడీ జరిగితే, కరెక్టే అని వాదించిన వ్యక్తి, ఇప్పుడు అబ్సర్డ్ అంటున్నాడు. నా ఒళ్ళు మండి పోయింది.

"కథలో అబ్సర్డ్ అయిన విషయం నిజ జీవితంలో కాదా?... సరయితే, ఆ వాళ అలా వాదించా వేం?" అన్నాడు ఉక్రోషంగా.

నా మాటలు వాడికి రుచించలేనట్టుంది. అసహనంగా మొహం పెట్టి, అక్కణ్ణించి కదిలి పోబో యాడు. అదే సమయంలో వాడి టెరిలీన్ షర్టు జేబులో పెట్టుకున్న డబ్బు నా కంట పడింది. ఒక అయిడియా మెరిసింది నా మనసులో.



చిత్రం— ఆనందకుమార్

"ఆగరా!" అన్నాను.

ఆగాడు టక్కున.

వాడి జేబులో చెయ్యి పెట్టి డబ్బు తీసి, నా జేబులో పెట్టుకున్నాను, మరో మాట అనకుండా.

"అదేమిటి?" అన్నాడు వాడు తెల్లగా పాలి పోయిన మొహంతో.

కథల్లో విప్లవాన్ని తెగ ఒలికించేస్తున్నా, ఎవ డైనా మీదబడితే, ఎదురు తిరగలేని చచ్చు పిరికి సన్నాసి వాడు. ఆ విషయం నాకు బాగా తెలుసు.

"వ్యక్తులు ఎవరైనా, దోపిడీ దోపిడీయే జవాబు అన్నావు. గుర్తుందా?"

అవునన్నట్టుగా ఇబ్బందిగా తలూపాడు.

"అయితే నాకు జరిగిన ఆనాటి దోపిడీకి ఇది నా జవాబు" అన్నాను కసిగా.

"ఎలా?"

"నా చేతగానితనం, వాడి అవసరం తప్ప మరొకటి చూడకుండా నా దగ్గర నా డబ్బు కొట్టే శాడు. ఆ సంగతి నీకు చెప్తే, దాన్ని కథగా రాసి డబ్బు చేసుకున్నావు. నిజానికి మీ ఇద్దరూ కష్ట పడింది ఏమీ లేదు. బాధపడింది, నష్ట పడింది నేను. దానికి ప్రతిఫలం మీ కెందుకు ముట్టాలి? వాణ్ని నేను తన్ని డబ్బు రాలాగా పట్టుకోలేక పోయాను. ఇహ నువ్వంటావా? నీ సంగతి నాకు తెలుసు. పిరికి సన్నాసివి. అందుకే, దోపిడీకి దోపిడీ

జవాబుగా నీ దగ్గర్నుంచి ఈ డబ్బు లాక్కుంటున్నాను. నువ్వు చెప్పగలిగిందేమన్నా ఉందా?'' అని వాడి మొహంలోకి తీక్షణంగా చూస్తూ జవాబుకోసం ఎదురుచూశాను.


వాడేం మాట్లాడలేదు రెండు క్షణాలు గడిచినా.

అసలు వాడేం మాట్లాడగలడు? ఎక్కడో లోపల చేసిన దోపిడీకి బదులు ఇక్కడే, ఆ వ్యక్తి నుండే తీర్చుకోడంగాక, మరొకడి మీద తీర్చుకుంటే— అది రైటే అన్న వాడి రూలు నా పక్షంలో ఎలా తప్పవుతుంది?

జేబులో వాడి డబ్బుతో అక్కడ్నుంచి కదిలి పోయాను.

ఆశ్చర్యంగా, వాడి జేబులోంచి నేను తీసుకొన్న మొత్తం కూడా— ఆ రోజు నేను పోగొట్టుకున్నంతే. సరిగ్గా పాతిక రూపాయలు. *


# కాలగమనం ఆగిపోదు-



అందుకే మరి రజని, ఆమె భర్త రఘునాథ్, యిద్దరూ తెలివిగా బ్యాంక్ ఆఫ్ ఇండియా దగ్గరికి వెళ్ళారు, రుణం కోసం, వాళ్ళ పంటలకు ఎరువుల్ని కొనుక్కోవాలని.

తర్వాత పుష్కలంగా పండింది- మరి యిక రఘునాథ్ దాంతో, పిల్లల భవిష్యత్తుకుగాను తను వేసుకున్న పథకాలను అమలులో పెట్టగలిగాడు.

తక్కువ రేట్ల వడ్డీతో తీర్చగలిగే రుణాలివ్వడంతో బాటే, బ్యాంక్ ఆఫ్ ఇండియా దగ్గర మీ ప్రత్యేకమైన అవసరాలకు సరిపడేలా అనేక పొదుపు పథకాలున్నాయి—దీర్ఘకాల పరిమితిగలవీ, తక్కువకాల పరిమితిగలవీను.

మీకు అతిదగ్గరలోవున్న బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖను నేడే సందర్శించండి. రండి, దేశంలోకల్లా పెద్దదైన, జాతీయమైన బ్యాంకుతో మీ భవిష్యత్తును పదిలపరుచుకోండి.

బ్యాంక్ ఆఫ్ ఇండియా
(భారత ప్రభుత్వ జాతీయ సంస్థ)

CONCEPT-BOI-4279 TEL